

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

3లో


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక -139 బుధవారం 13 ఆగస్టు 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఏపీకి సెమీ కండక్టర్ పరిశ్రమ...

- కేంద్రం నిర్ణయంపై సీఎం చంద్రబాబు హర్షం
- ఆంధ్రప్రదేశ్‌కు సెమీ కండక్టర్ యూనిట్ కేటాయించిన కేంద్రం
- కేంద్ర కేబినెట్ నిర్ణయం ఆమోదం
- ఏర్పాటు చేయనున్న దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ
- రూ. 468 కోట్ల భారీ పెట్టుబడితో ప్లాంట్ నిర్మాణం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలిపిన సీఎం
- మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల కోసం చిప్స్ ఉత్పత్తి



2లో.

## జస్టిస్‌వర్మపై అభిశంసనకు లోక్ సభలో శ్రీకారం

- అలహాబాద్ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై అభిశంసన ప్రక్రియ
- లోక్‌సభలో తీర్మానాన్ని చదివి వినిపించిన స్పీకర్ ఓం బిర్లా
- జడ్జి నివాసంలో కాలిపోయిన కరెన్సీ దొరకడమే ప్రధాన ఆరోపణ
- విచారణకు సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- భారత చరిత్రలో ఒక సిట్టింగ్ జడ్జిపై అభిశంసన ఇది మూడోసారి
- లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన 209 మంది ఎంపీల మద్దతు





# ఓరుగల్లు ఒణికింది



## నీట మునిగిన వరంగల్ జంటనగరాలు

- మత్తడి పోస్తున్న పలు గ్రామాల చెరువులు
- పొంగి ప్రవహిస్తున్న ఆకేరు వాగు
- తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు
- ఉరుములు,మెరుపులతో వానలు పడతాయ్
- ప్రజలు అసవరమైతే తప్ప బయటకు రావద్దు
- సాగర్ 16 క్రస్ట్ గేట్లుఎత్తి నీటి విడుదల



హైదరాబాద్,**ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసింది. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. **మిగతాది 2లో...**



## వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి

- ట్రంప్ అధిక సుంకాలు.. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్రం కీలక ప్రకటన
- ఆగస్టు 7 నుంచి కొన్ని భారత వస్తువులపై 25 శాతం సుంకం విధింపు
- ఆగస్టు 27 నుంచి మరికొన్నింటిపై అదనంగా మరో 25 శాతం సుంకం
- అమెరికా చర్యలు అన్యాయమైనవని, అహేతుకమైనవని పేర్కొన్న భారత్
- ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలకు ప్రస్తుతానికి సుంకాల నుంచి మినహాయింపు

2లో.

## కృష్ణమ్మ పరవళ్లు,,!

- శ్రీశైలం జలాశయం కు మళ్లీ పెరిగిన వరద ఉధృతి
- ముచ్చటగా మూడోసారి 4 రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తిన వైనం..
- 2.02 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల

**నంద్యాల ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా కృష్ణమ్మ ఉప్పొంగిపోతోంది. ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో శ్రీశైలం జలాశయంలోకి వరద ప్రవాహం వేగంగా చేరుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి, నాగార్జునసాగర్ వైపు నీటిని విడుదల చేశారు. **మిగతాది 2లో...**



## అప్రమత్తంగా ఉండాలి

- తెలంగాణకు భారీ వర్ష సూచనతో అప్రమత్తం
- 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- కరెంట్, మంచినీటి ఇబ్బంది రాకుండా చర్యలు
- ఉద్యోగులకు మూడురోజుల పాటు సెలవులు రద్దు
- అధికారులు, కలెక్టర్లతో సిఎం రేవంత సమీక్ష



హైదరాబాద్,**ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అధికారులు, జిల్లా కలెక్టర్లు, మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మూడు రోజుల పాటు అధికారులు, **మిగతాది 2లో...**





## ఖజానా జువెలర్స్ లో దొంగల బీభత్సం...

- సిబ్బందిపై కాల్పులు
- ఆరుగురు సభ్యుల దొంగల ముఠా దాడి
- అసిస్టెంట్ మేనేజర్ పై కాల్పులు
- దొంగల కోసం గాలిస్తున్న 10 పోలీసు బృందాలు

2లో.

## భారీగా రహదారుల నిర్మాణం

### వారసత్వంగా రూ.45 వేల కోట్ల బకాయిలు : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో హ్యామ్ ప్రాజెక్టు కింద భారీగా రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం అభివద్ధి పనుల బకాయిల పేర రూ.45,000 కోట్లను వారసత్వంగా ఇచ్చి వెళ్ళిందని విమర్శించారు. తెలంగాణ రైజింగ్‌లో కాంట్రాక్టర్లు భాగస్వాములు కావాలనీ, హ్యామ్ రోడ్డు పనుల్లో చిన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో మంగళవారం హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ రోడ్ షోకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ





రహదారులు నాగరికతకు చిహ్నాలు, రహదారులు అభివద్ధి జరిగితే మారుమూల ప్రాంతాల నుంచి ఎక్కడికైనా ఉత్పత్తైన వస్తువులను సులువుగా తరలించవచ్చని అన్నారు. రహదారుల నిర్మాణంతో పరిశ్రమలు పెరిగి తద్వారా మన రాష్ట్ర యువతకు ఉపాధి, ఆదాయం సమకూరుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ కార్యక్రమాలే కాదు తెలంగాణ రైజింగ్‌లో భాగంగా మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాలను ముందుకు తీసుకు వెళుతుందని తెలిపారు. **మిగతాది 2లో...**

## బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు..!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేశారన్న కేటీఆర్
- బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం
- బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్



2లో.

## ఖజానా జువెలర్స్ లో దొంగల బీభత్సం...

హైదరాబాద్ **ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ శివారు చందానగర్ లో దొంగలు రెచ్చిపోయారు. చందానగర్ లోని ప్రముఖ నగల దుకాణం ఖజానా జువెలర్స్ లో దొంగలు దోపిడీకి యత్నించారు. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో అడ్డుకున్న సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా, కాల్పులు కూడా జరిపారు. ఈ కాల్పుల్లో సిబ్బందికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేయడంతో దొంగలు పారిపోయారు.పరారైన దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. దొంగలు తొలుత ఖజానా జువెలర్స్ గేట్ వద్ద ఉన్న సిబ్బందిని గాయపరిచి లోపలకు ప్రవేశించారు. ఆ తర్వాత షాపు లోపల ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. లాకర్ కీ ఇవ్వడానికి నిరాకరించిన అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. దీంతో ఆయన కాలులోకి ఒక బుల్లెట్ దూసుకెళ్లింది.షాపు లోపల నగలు ఉన్న స్టాల్స్ ను పగులగొట్టారు. తుపాకీతో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ దొంగల ముఠాలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్నట్టు సమాచారం. దొంగలు దొరికిన కాడికి దోచుకుని పరారయ్యారు. ఎక్కువగా వెండి వస్తువులు చోరీకి గురైనట్టు సమాచారం. దొంగలు జహీరాబాద్ వైపు పారిపోగా... జిల్లా సరిహద్దు పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. పరారైన దుండగుల కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో చందానగర్ లో భయానక వాతావరణం నెలకొంది.

## కృష్ణమ్మ పరవళ్లు..!

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో శ్రీశైలం జలాశయంకు భారీగా వరద వచ్చి చేరుతుంది. అధికంగా శ్రీశైలం జలాశయం లోకి 1,89,014 క్యూసెక్కుల నీరు రావడంతో మంగళవారం ఉదయం 8 గంటలకు నాలుగు రేడియల్ ట్రస్ట్ గేట్ల ను పది అడుగుల మేర ఎత్తి నాగార్జునసాగర్ కు క్రిందకి నీరు వదిలారు. జూరాల, సుంకేశుల బ్యారేజ్‌ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,89,014 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 65,689 క్యూసెక్కులను దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.
మహారాష్ట్ర, కర్ణాటక లలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మలప్రభ, ఘటప్రభలలో వరద పోటెత్తుతోంది. దాంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ఉధృతి పెరిగింది. శ్రీశైల జలాశయంలో అధికారులు తెలిపిన లెక్కల వివరాల ప్రకారం.. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయంలో 882.60 అడుగులున్నాయి. జలాశయంలో నీటి సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో నీటి సామర్థ్యం 202.5056 టీఎంసీలుగా నమోదైంది. విద్యుత్ ఉత్పత్తి కి కుడి ఎడమల నుంచి 65,689 క్యూసెక్కుల నీటిని సాగర్ కు విడుదల చేస్తున్నారు.ఏపీ జల విద్యుత్ కోసం 30,374 క్యూసెక్కుల నీటిని వాడుతుండగా, తెలంగాణ ప్రాంతం నుంచి 35,315 క్యూసెక్కుల నీటిని జల విద్యుత్ కోసం వినియోగిస్తున్నారు. గత నెల 4వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీశైలం నుంచి 4గేట్లను పైకి ఎత్తి కిందకి నీరు విడుదల చేశారు. తిరిగి రెండవసారి జులై 20వ తారీకున గేట్లు ఎత్తి కిందకి నీరు వదిలారు. ముచ్చటగా మూడోసారి ఆగస్టు (%ూబస్త్రబర్%) నెలలో 12వ తేదీన నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను పది అడుగుల మేర ఎత్తి సాగర్ కు నీరు వదిలారు.
ప్రస్తుతం శ్రీశైలం జలాశయం కు ఇన్ ఫ్లో 1,89,014 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఇందులో జూరాల ప్రాజెక్టు (%జీబత్శీశ్రీఖ ్రాతీశీయవష్%) నుంచి 28,870 క్యూసెక్కుల నీరు, స్పిల్ వే నుంచి 1,17,385 క్యూసెక్కుల నీరు, సుంకేసుల ప్రాజెక్టు నుంచి36,909, క్యూసెక్కుల నీరు, హంద్రీ నుంచి 5890 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయం నుంచి క్రిందకు 2,02,456 క్యూసెక్కుల నీరును సాగర్ కు వదులుతున్నారు. ముచ్చటగా ఈ ఏడాది మూడోసారి ట్రస్ట్ గేట్లే ఎత్తటంతో ప్రయాణికుల సందడి మొదలైంది.

## అప్రమత్తంగా ఉండాలి

**(మొదటి పేజి తరువాయి)**
రాష్ట్రంలోని మహిళలు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో సీఎం అధికారులను ఆదేశించారు. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు- సామర్థం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని... ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని సీఎం నిర్దేశిరచారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించేలా చూడాలన్నారు. ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్దంగా ఉండాలి. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలిగించాలి. టాయిలెట్లను ప్రతి 2 గంటలకు ఒకసారి
శుభ్రపరచాలి. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రయాణికులు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదు. అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ఎ÷-లాంట్లు- ఏర్పాటు- చేయాలి. రూ.30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్తగా ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు- చేయాలి. ప్యాసింజర్లకు సహకరించేలా 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది బస్ స్టేషన్‌లో అందుబాటు-లో ఉండాలి. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి వస్తుండటంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ-ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని వివరించారు. వీరికి జీరో ఫేర్ టిక్కెట్ కోసం ఈపోస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ ఆగస్ట్ 14కల్లా అప్డేట్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 15న మధ్యాహ్నం విజయవాడలోని పండింట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు. మరోవైపు సమీక్షలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అందించే సాయంపైనా అధికారులతో చర్చించారు. ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో కలిపి... కొత్త పథకం రూపొందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

## బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు..!

హైదరాబాద్,**ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-తో పాటు- ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లయింట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు- సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీ-సులో కేటీ-ఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీ-సులో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కేటీఆర్ అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీ-సులో కోరారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణలతో కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో కేటీఆర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

# వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి

**న్యూఢిల్లీ,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):**
అమెరికా కొన్ని భారతీయ ఉత్పత్తులపై కొత్తగా సుంకాలు విధించినప్పటికీ, ఆ దేశంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వాణిజ్యం, పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా వాషింగ్టన్‌తో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.భారత్ నుంచి ఎగుమతి అయ్యే కొన్ని వస్తువులపై అమెరికా ఆగస్టు 7 నుంచి 25 శాతం సుంకం విధించిందని మంత్రి తెలిపారు. దీనివల్ల అమెరికాకు జరిగే మొత్తం భారత ఎగుమతుల్లో దాదాపు 55 శాతం విలువపై ప్రభావం పడుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా, మరికొన్ని భారతీయ వస్తువులపై ఈ నెల, అంటే ఆగస్టు 27 నుంచి అదనంగా మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి కీలక రంగాల ఉత్పత్తులపై ఇప్పటివరకు ఎలాంటి అదనపు సుంకాలు విధించలేదని ఆయన స్పష్టం చేశారు.అమెరికా విధించిన సుంకాల వల్ల భారత ఎగుమతులపై, ముఖ్యంగా టెక్స్‌టైల్స్ రంగంపై పడే ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని జితిన్ ప్రసాద తెలిపారు. ఉత్పత్తి నాణ్యత, డిమాండ్, ఒప్పందాలు వంటి అనేక అంశాలు ఈ ప్రభావాన్ని నిర్ధారిస్తాయని అన్నారు. ఈ విషయంపై ఎగుమతిదారులు, పారిశ్రామిక వర్గాలతో సహా అన్ని భాగస్వామ్య పక్షాలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన చెప్పారు. రైతులు, కార్మికులు, పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న తాజా సుంకాల నిర్ణయాలను భారత ప్రభుత్వం "అన్యాయమైనవి, అహేతుకమైనవి, సమర్థనీయం కానివి" అని అభివర్ణించింది. "భారతదేశంలోని 140 కోట్ల ప్రజల ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని, మార్కెట్ అంశాల ఆధారంగానే మా దిగుమతులు ఉంటాయి. ఈ విషయంలో మా వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశాం. అనేక ఇతర దేశాలు కూడా తమ జాతీయ ప్రయోజనాల కోసం చర్యలు తీసుకుంటుంటే... కేవలం భారత్‌పైనే అమెరికా అదనపు సుంకాలు విధించడం అత్యంత దురదృష్టకరం" అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు 2025 మార్చిలో ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఐదు విడతల చర్చలు జరగ్గా, చివరిసారిగా జూలై 14 నుంచి 18 వరకు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు.

# జస్టిస్‌వర్మపై అభిశంసనకు లోక్ సభలో శ్రీకారం

**న్యూఢిల్లీ,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):**
భారత న్యాయవ్యవస్థ చరిత్రలో అత్యంత అరుదైన, రాజ్యాంగపరంగా కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన ప్రక్రియకు లోక్‌సభ మంగళవారం శ్రీకారం చుట్టింది. ఆయన అధికారిక నివాసంలో కాలిపోయిన స్థితిలో భారీగా నగదు కట్టలు లభ్యం కావడం ఈ పరిణామాలకు దారితీసింది. ఈ అభిశంసన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభలో అధికారికంగా చదివి వినిపించారు.ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలోని జస్టిస్ వర్మ ప్రభుత్వ నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కాలిపోయిన కరెన్సీ నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై జరిగిన అంతర్గత న్యాయ విచారణలో, ఆ నగదుపై జస్టిస్ వర్మకు "రహస్య లేదా క్రియాశీలక నియంత్రణ" ఉందని తేలింది. ఈ నివేదిక ఆధారంగా, భారత ప్రధాన న్యాయమూర్తి ఆయనను పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేశారు. దీనిని అనుసరించి, రవిశంకర్ ప్రసాద్‌తో పాటు లోక్‌సభ నుంచి 146 మంది, రాజ్యసభ నుంచి 63 మంది సభ్యులు సంతకాలు చేసిన అభిశంసన తీర్మాన నోటీసును జులై 31న స్పీకర్‌కు అందజేశారు.ఈ తీర్మానంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించి, దానిని చర్చకు స్వీకరిస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. "నిబంధనల ప్రకారం ఈ తీర్మానంలో తగిన బలం ఉందని నేను భావిస్తున్నాను. అందుకే దీనిని స్వీకరించి, ఆరోపణలపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నాను" అని ఆయన తెలిపారు. జడ్జిల విచారణ చట్టం-1968 ప్రకారం ఏర్పాటైన ఈ త్రిసభ్య కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయవాది వి.వి. ఆచార్య సభ్యులుగా ఉంటారని స్పీకర్ వెల్లడించారు.

# వామన్‌రావు దంపతుల హత్య కేసు సిబిఐకి

**న్యూఢిల్లీ,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):**
న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావ్, నాగమణిల హత్య కేసును మంగళవారం సుప్రీంకోర్టు సిబిఐకి అప్పగించింది. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వామన్‌రావు స్వగ్రామం పెద్దపల్లి జిల్లా, మంథని మండలంలోని గుంజపడుగ. 2021లో పెద్దపల్లి జిల్లా కల్వచర్ల గ్రామ శివారులో ఈ న్యాయవాద దంపతులు వెళ్తున్న కారును అడ్డగించి నడిరోడ్డుపై కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన రాష్ట్రంతో పాటు దేశంలోనూ సంచలనం సృష్టించింది.
మన తెలంగాణ/మంథని రూరల్: నాయ్యవాద దంపతు లు గట్టు వామన్‌రావ్, నాగమణిల హత్య కేసును సుప్రీం కోర్టు సిబిఐకి అప్పగించింది. మంథని మండలంలోని గుంజపడుగ గ్రామం కాగా 17 ఫిబ్రవరి 2021లో పెద్దపల్లి జిల్లా కల్వచర్ల గ్రామ శివారులో న్యాయవాద దంపతులు వెళుతున్న కారును అడ్డగించి నడిరోడ్డుపై ఇరువుర్ని దారుణంగా కత్తులతో పొడిచి హతమార్చిన సంఘటన రాష్ట్రంతో పాటు దేశంలోనూ సంచలనం సృష్టించింది. కేసులో పలువుర్ని అరెస్టు చేయగా దర్యాప్తు



ఇంకా కొనసాగుతుంది. అయితే కేసును సిబిఐకి అప్పగించాలని వామన్‌రావ్ తండ్రి కిషన్ రావ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్పందించిన అత్యున్నత న్యాయస్థానం కేసును సిబిఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కె సింగ్లాల ధర్మాసనం పిటిషనర్‌ను విచారించి తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే హత్యకు సంబందించిన వీడియోలు, పత్రాలు అందజేయాలని ఆదేశించింది. ఈ లోగా కేసును సిబిఐకి అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వం తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. మరోవైపు మరణవాంగ్మూలం వీడియో అసలుదేనని ఎఫ్ఎస్ఎల్ నివేదిక తేల్చింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది. అన్ని అంశాలను పరిశీలించి దర్యాప్తు చేయాలని సిబిఐను న్యాయస్థానం ఆదేశించింది. సిబిఐ విచారణలో వాస్తవాలు అన్ని వెలుగులోకి వస్తాయనే నమ్మకం తమకు ఉందని వామన్‌రావ్ తండ్రి కిషన్‌రావ్ తెలిపారు.

**అసలు దోషులకు శిక్ష పడాలి: శ్రీధర్ బాబు**
గట్టు వామనరావు, నాగమణి దంపతుల హత్య కేసు సిబిఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇది న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అసలు దోష లు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు.

# భారీగా రహదారుల నిర్మాణం

**(మొదటి పేజీ తరువాయి)**
పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 17 ప్యాకేజీల ద్వారా 7,947 కిలోమీటర్లు, రోడ్లు భవనాల శాఖ పరిధిలో 17 ప్యాకేజీల ద్వారా 5,190 మేరకు రోడ్లు అభివద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. క్యాబినెట్ ఆమోదించిన రోడ్డు పనులకు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలనీ, కాంట్రాక్టర్లకు ఆర్థికంగా ప్రోత్సాహం కల్పించేందుకు బ్యాంకర్లతోనూ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు దష్టి పెట్టి పని చేయడంతో క్రమంగా ఆర్థిక పరిస్థితులు చక్కబడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల ఇబ్బందులను అధిగమించే ప్రయత్నం చేస్తుందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.
అద్దంలాంటి రోడ్లు:కోమటిరెడ్డి
ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించనున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ రోడ్ షోకు వచ్చిన డిప్యూటీ చీఫ్ మినిస్టర్ భట్టి విక్రమార్క, సహచర మంత్రివర్యులు సీతక్కకు ధన్యవాదాలు చెప్పారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. అందులో భాగంగానే, హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో రహదారుల నిర్మాణానికి పూనుకున్నామన్నారు. ప్రజలను రహదారులతో అనుసంధానించడం, రాష్ట్ర అభివద్ధిని ప్రోత్సహించడం, తెలంగాణ భవిష్యత్తుకు రూపకల్పన చేయడం అనే ఆశయంతో అవిశ్రాంతంగా కషి చేస్తున్నామన్నారు. తెలంగాణ, దేశంలోనే అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటనీ, గత పదేండ్లలో రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోగతి ఎంత ముఖ్యమో, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అంతే ముఖ్యమని వ్యాఖ్యానించారు. హ్యామ్ మొదటి దశలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం 17 ప్యాకేజీలలో 7,947 కిలోమీటర్ల రోడ్డు పనులను చేపడుతుందన్నారు. రోడ్లు, భవనాల శాఖ అభివద్ధి చేయాలని తలపెట్టిన 12 వేల కిలోమీటర్ల రహదారుల్లో మొదటి దశలో 6478.33 కోట్ల రూపాయలతో 17 ప్యాకేజీలలో 5,190 కిలోమీటర్ల రోడ్లను అభివద్ధి చేస్తుందన్నారు. మిగిలిన 6810 కిలోమీటర్ల రహదారులను వచ్చే డిసెంబర్ నాటికి టెండర్లు పిలిచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు ఒణికింది

**(మొదటి పేజి తరువాయి)**
భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తూ.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ప్రజలు వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లాల్సిన రైతుల కూడా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 కు ఫోన్ చేయాలని అధికారులు వెల్లడించారు. ఇకపోతే ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 1,77,173 క్యూసెక్కుల వరద వస్తోంది. స్పిల్‌వే ద్వారా 1,28,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులుగా ఉంది. ఇకపోతే వరంగల్, హనుమకొండ, కాజీపేటలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు- ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వర్ధన్నపేటలోని ఆకేరువాగు పొంగిపొర్లుతోంది. సంగెం మండలం ఎల్గూరురంగంపేట పెద్దచెరువు, పర్వతగిరి మండలం ఏనుగల్లు ఊరచెరువు మత్తడి పోస్తోంది. ఎల్గూరు స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం- ఎల్గూరు రంగంపేట గ్రామాల మధ్య రైల్వే అండర్ పాసు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ఆ గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి రెండు వైపులా రహదారి దిగ్బంధం కావటంతో ఎల్గూరు రంగంపేట గ్రామం జల దిగ్బంధమైంది. వరదల కారణంగా వర్ధన్నపేట తహశీల్దార్ కార్యాలయం నీట మునిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆముదాల పల్లెలో గండివాగు పంట పొలాల మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. గొల్లబుద్ధారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం పూర్తిగా జలమయమై, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. గద్దగుంట వాగు పొంగి, భూపాలపల్లి నుంచి రాంపూర్,గొల్లబుద్ధారం మీదుగా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలావుంటే గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలోని పలు ప్రాంతాలు తడిసి ముద్దావుతున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక రాష్ట్రంలో బుధవారం అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. అందుకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

జర్నలిస్ట్ వార్త
RNI NO: TELTEL/2023/87607
బుధవారం 13 ఆగస్టు 2025

# వత్తిళ్ళకు గురి అవుతున్న పంచాయితీ కార్యదర్శులు



**కల్లూరు,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** పంచాయతీ సర్పంచ్ గ్రామపంచాయతీ లో లేక, పంచాయతీ లో నిధులు లేక కనీస వసతులు సమాకుర్చుడానికి కూడా పెట్టు బడి దారుల వైపు చూడాల్సి వస్తున్నది అని పంచాయితీ కార్యదర్శిల ఆవేదన వ్యక్తిత్వం చేస్తున్నారు. కల్లూరు మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయతీ లో గత నాలుగు రోజులు నుండి నీటి సమస్య తో ఇబ్బందులకు గురి అవుతున్న ప్రజలు.అంబెడ్కర్ నగర్ వెళ్లే రోడ్డు పక్కన ఉన్న పెద్ద వాటర్ ట్యాంక్ దగ్గర గేటు వాల్ లు రిపేరు రావడం వల్ల గ్రామ ప్రజలకు గత మూడు రోజుల నుండి వాటర్ రాక గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆ గేటు వాల్ రిపేర్ అవదు అట్టి గేటు వాల్ ని మార్చి కొత్త గేటు వాల్ ని ఫిట్ చెయ్యాలి అని మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది చెప్పిన సమాచారం తో పంచాయతీ కార్యదర్శి గేటు వాల్ ని పరిశీలించారు. కొత్త గేటు వాల్ మార్చాలి అంటే సుమారుగా ఇరవై వేల రూపాయలు వరుకు ఖర్చు అవుతుంది అని తెలుసుకుని ఏమి చెయ్యాలో అర్థం కానీ స్థితి లో పంచాయతీ కార్యదర్శి.ఉన్నారు.నీళ్లు రావడం లేదు అని ప్రజలు స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వడం తో కార్యదర్శి ని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి గేటు వాల్ పని చెయ్యడం లేదు, రిపేరుకూడా అవదు కొత్తది మార్చాలి అని సమాచారం ఇవ్వగా స్పందించిన స్థానిక నాయకుడు వద్ద ముందస్తు పెట్టుబడిగా 20,000/-రూపాయలు తీసుకోని నూతన గెట్ వాల్ ని తీసుకోని రావడం జరిగింది. ఆ గేటు వాల్ ని పాత గేటు వాల్ స్థానం లో అమర్చి గ్రామ ప్రజలకు నీటి సమస్య పరిస్కారం చూపిస్తా అని తెలిపారు.





# లేబర్ కార్యాలయాన్ని వర్ధన్నపేట కు తరలించాలి


**-ఎంసిపిఐ(యు)వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు గుగులోతు అరుణ్ నాయక్.**



**రాయపర్తి/ఆగస్టు 12(జర్నలిస్ట్ వార్త):** పరకాల పట్టణ కేంద్రంలో ఉన్న వర్ధన్నపేట లేబర్ ఆఫీసు కార్యాలయాన్ని తక్షణమే వర్ధన్నపేట ప్రాంతానికి తరలించాలని ఎంసిపిఐ(యు)పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు అరుణ్ నాయక్,బహుజన సామాజిక కార్యకర్తలు సురేష్ బాబు,సంతోష్,బాలాజీ కోరారు.మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాయపర్తి,వర్ధన్నపేట కు సంబంధించిన భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు లేబర్ కార్డుల కోసం, లేబర్ కార్డు ఉన్న వ్యక్తులు వివిధ క్లైమూల కోసం సుమారు 80 కిలోమీటర్ల మేరా పరకాల పట్టణ కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందనీ అన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్నటువంటి లేబర్ కార్డు ప్రయోజనాల గురించి రాయపర్తి,వర్ధన్నపేట ప్రాంత కార్మిక లోకానికి ఏమాత్రం అవగాహన లేకుండా ఉందని తక్షణమే వర్ధన్నపేట మండలానికి లేబర్ కార్యాలయాన్ని పరకాల నుండి వెంటనే తరలించాలని వారు కోరారు. అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి వర్ధన్నపేట ప్రాంతానికి లేబర్ కార్యాలయాన్ని తరలించాలని ఒకవేళ తరలించని యేడల కార్మికుల లోకంతో పెద్ద ఎత్తున ఉద్యమాలకు పూనుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ రాంబాబు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైలారం దుర్గమ్మ ఆలయంలో దొంగల బీభత్సం

**-15 తులాల వెండి ఆభరణాలు అపహరణ**



**రాయపర్తి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలంలో దొంగలు బీభత్సం సృష్టించారు.మండలంలోని మైలారం గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో మంగళవారం తెల్లవారు జామున దొంగలు చొరికి పాల్పడ్డారు.ఆలయ తాళాలు పగులకొట్టి అమ్మవారి 15 తులాల వెండి నగలను దొంగలు అపహరింకుపోయారు.హుడిని పగల గొట్టి 5000 రూపాయలను ఎత్తుకు పోయారు.ముదిరాజు సంఘం సభ్యులు బోయిని కుమారస్వామి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.

## బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత



**రాయపర్తి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన బలగం బుచ్చయ్య,రాయపర్తి రాయపర్తి గ్రామానికి జనగోని బిక్షపతి, జనగోని అనసూయ, పనీష్ తండ గ్రామానికి చెందిన కోర్ర మోహన్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం ఫౌండేషన్ బాధిత కుటుంబాలను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల మధుకర్ రెడ్డి పరామర్శించి బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో బందెల బాలరాజు,గజవెల్లి ప్రసాద్,రాయపర్తి తాజా మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్రబోయిన సుధాకర్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రామ్, దేవస్థాన మాజీ డైరెక్టర్ చిన్నాల ఉప్పలయ్య,మండల పార్టీ ముఖ్య నాయకులు లిఖిత కుమార్, పోగులకొండ వేణు, సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, ఉబ్బని సింహాద్రి, కోలా సంపత్, కుంట రాంబాబు, పెద్దగోని జీవన్, మైస వెంకటేశం, బల్లెం యాదగిరి, నారగోని శ్యామ్ ప్రసాద్,ఉబ్బని మధు,పీరని రాజు, కాశ్రబోయిన రామ్మూర్తి,ఉబ్బని కిషోర్, పిరని రవీందర్,పెద్దగోని సందీప్,గజావెల్లి ప్రసాద్,సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, కోలా సంపత్, వినోద్, మాజీ సర్పంచ్ భూక్య బాద్రు నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు దుప్పట్లు అందజేత

**- ఆశ్రమంలో డా. ఇమ్మడి నిఖిల్ జన్మదిన వేడుకలు**




**సత్తుపల్లి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణ ప్రముఖులు... ఇమ్మడి రంగారావు మనవడు ,ప్రముఖ వైద్యులు డాక్టర్ ఇమ్మడి ప్రసాద్ కుమారుడు డా. ఇమ్మడి నిఖిల్ హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. సోమవారం డాక్టర్ ఇమ్మడి నిఖిల్ జన్మదినం సందర్భంగా సత్తుపల్లిలో సిద్ధారం రోడ్డులో గల దివ్యాంగుల ఆశ్రమంలోని వికలాంగులకు స్థానిక విశ్వశాంతి విద్యాలయం నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు దుప్పట్లు, పండ్లు అందజేశారు.ఈ కార్యక్రమం ల్లోఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల గైర్హాజరు కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయుల గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహ వ్యక్తం చేశారు.

మంగళవారం భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన అశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని రోగుల హాజరు పట్టిక, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి జరుగుతున్న వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవసరమైన వ్యాక్సిన్లు, ఇతర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

అనంతరం ప్రక్కనే ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం, పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అసహనం వ్యక్తం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కారణం లేకుండా గైర్హాజరు కావడం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లకు తాళాలు వేసి ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి యొక్క లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని బాగా చదవాలని సూచించారు. విద్యార్థి లక్ష్య సాధనకు 10వ తరగతి మొదటి మెట్టు అని ప్రతి విద్యార్థి బాగా చదవాలని, మంచి మార్కులు సాధించాలని సూచించారు.

వంటగదిని పరిశీలించి భోజనం ఏవిధంగా ఉందో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో సానులు



భద్రపరచడానికి అవసరమైన ర్యాక్ లు అందిస్తామని తెలిపారు.పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వార్డెన్ ను ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్ఓ శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ నాగరాజు, ఆర్.ఐ రామస్వామి, హాస్టల్ వార్డెన్ సమ్మయ్య, డాక్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

**అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సౌకర్యాలు -అటవీశాఖపై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు**

**హైదరాబాద్,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ - టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం




రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు- చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే పక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించిన

## జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

**హుజురాబాద్/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** రాహుల్ గాంధీ అరెస్ట్ ను జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ రాహుల్ గాంధీ అరెస్టు ఈసీ,బీజేపీల కుమ్మక్కుకు మరో సాక్ష్యం అని మండిపడ్డారు. ఇండియా కూటానికి చెందిన 300 మందికి పైగా ఎంపీలు చేపట్టిన నిరసనలు పోలీసులు అడ్డుకోవడం చాలా హీనమైన చర్య అని, మీ అరెస్టులు ప్రజాస్వామ్య విలువలు పై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడు కి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని ఆ హక్కును అడ్డుకునే అధికారం ఎవరికి లేదన్నారు. ఎలక్షన్ కమిషన్ మోడీ అమిత్ షా కనుసన్నాలో నడుస్తుందనీ, ఇటీవల రాహుల్ గాంధీ 2024 లో జరిగిన పార్లమెంటు ఎలక్షన్ పై అనేక అనుమానాలు ఉన్నాయని మీడియా సమావేశం పెట్టి విషయాలను చెప్పడం జరిగిందనీ, కర్ణాటక రాష్ట్రంలోని మహాదేవ్



అనే నియోజకవర్గంలో 40 మందితో 6 నెలలు రాహుల్ గాంధీ యొక్క టీం వర్క్ పని చేసిందనీ, అక్కడ ఎన్నీ దొంగ ఓట్లు ఉన్నాయని, అక్కడ ఎంతమంది ఓటర్లు ఉన్నారని తెలుసుకున్నారన్నారు. లక్ష దొంగ ఓట్లను గుర్తించారని, ఒకే ఇంటి నెంబరుతో దాదాపు పదివేల దొంగ ఓట్లను సృష్టించారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్న భారత ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు.ఒక్క మహదేవ్ అనే నియోజకవర్గంలో నకిలీ ఓట్లు సృష్టిస్తే, భారతదేశం మొత్తంలో అన్ని రాష్ట్రాల్లో ఎన్ని దొంగ ఓట్లను బిజెపి పార్టీ సృష్టించిందో విషయం స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం భారతదేశానికి సేవ చేయడానికి ఉందని వారి కుటుంబంలో ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని, అయిన కూడా వారి కుటుంబం ఏనాడు సేవ చేయడానికి వెనుకాడలేదని తెలిపారు.

# ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యుల అరెస్టు అప్రజాస్వామికం

**ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం సిగ్గుచేటు - ఓట్ల చోరీపై కేంద్ర ఎలక్షన్ కమిషన్ వాస్తవాలను వెల్లడించాలి**

**జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు**

**హుజురాబాద్/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** దేశ రాజధాని ఢిల్లీలో ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులపై ఎన్డీఏ సర్కార్ వ్యవహరించిన తీరును జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు తప్పుపట్టారు జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబాల రాజు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున కర్గే పార్లమెంటరీ పక్ష నేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత ప్రియాంక గాంధీ తో పాటు విపక్ష పార్లమెంట్ సభ్యులు ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు ఓట్ల గల్లంతుపై కేంద్ర ఎలక్షన్ కమిషన్ వాస్తవాలు చెప్పాలని ప్రజల పక్షాన నిలబడడానికి ర్యాలీ నిర్వహిస్తే పోలీస్ బలగాలతో అడ్డుకోవడం అన్యాయం అన్నారు ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కాలనుకోవడం నిజంగా సిగ్గుచేటన్నారు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారత్ లో ఓటే ప్రధాన ఆయుధం అన్నారు అలాంటి ఓటును ధన దాహంతో కేంద్రంతో కుమ్మక్కైన ఎలక్షన్ కమిషన్ కర్ణాటకలోని ఓ పార్లమెంట్ పరిధిలో లక్ష ఓట్లను బీహార్ రాష్ట్రంలో



58 వేల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమేనన్నారు అధికారం కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ ఎంతటి దిగజారుడు రాజకీయాలైన చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి ఎన్నికల కమిషన్ ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని అంబాల రాజు హితువు పలికారు ఈ ఓట్ల చోరీకి నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత పార్లమెంటరీ పక్ష నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారని ఆయన గుర్తు చేశారు ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు సైతం భాగస్వామ్యులు కావాలనుకుంటే 9650003420 నంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వాలని అంబాల రాజు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి చెన్నవేనా రమేష్ కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్ కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివరెడ్డి యువజన కాంగ్రెస్ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రామిడి సూర్యతేజారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగ అశోక్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ నేత నారపోగు వెంకట్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..



**తల్లాడ/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ పార్టీ నేత, రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ (వెంకటేశ్వర్లు) జన్మదిన వేడుకలు మంగళవారం హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ కు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి స్వయంగా వెంకట్ కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, స్వీటు తినిపించారు. ఇటువంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకట్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫోన్, సోషల్ మీడియా, ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



మీరిచ్చిన స్ఫూర్తితో రాజకీయంగా ముందుకు సాగుతానని, మీ ఆదరాభిమానాలకు అనుగుణంగా నడుచుకుంటూ పనిచేస్తానని పేర్కొన్నారు. అతి త్వరలోనే ప్రజల ముందుకు వచ్చి కార్యక్రమాలు యధావిధిగా చేపడుతానని వెంకట్ తెలిపారు.

# ఫ్రీడమ్ ఫైటర్స్ పెన్షన్ కేసుల పరిష్కారం

**ఎనిమీ ప్రాపర్టీ ఆస్తులు గుర్తించి తగు చర్యలు -ఉన్నతాధికారులతో సమీక్షించిన కేంద్రమంత్రి బండి సంజయ్**

**న్యూఢిల్లీ,ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** నెలాఖరులోపు స్వాతంత్య్ర సమరయోధుల పింఛను కేసులను పరిష్కరించాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కార్యాలయంలో పునరావాస విభాగంసీనియర్ అధికారులు, ఇండియాలో శత్రు ఆస్తుల సంరక్ష అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్య్ర సమరయోధుల పెన్షన్లు, శత్రు ఆస్తుల ఆర్థికీకరణ, శరణార్థుల పునరావాసలపై అధికారులు కేంద్ర మంత్రికి సమగ్ర నివేదిక అందజేశారు. స్వాతంత్య్ర సమరయోధుల పెన్షన్ కేసులను ఈ నెలాఖరులోపు పరిష్కరించాలని బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ఆస్తులున్నాయని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వివరించారు. 600లకుపైగా ఎనిమీ ప్రాపర్టీస్ వేలం దశలో ఉన్నాయని తెలిపారు. ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించి, ఎనిమీ ఆస్తులపై తక్షణమే సర్వే చేయించాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీస్ సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని ఆయన చెప్పుకొచ్చారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ మహోత్సవం



**గణపురం/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** భారత కేంద్ర ప్రభుత్వం 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి భారతీయుడు తమ ఇళ్లల్లో జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని ఐక్యతను ప్రదర్శించాలని తెలియజేసే క్రమంలో హర్ ఘర్ తిరంగా "ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం" కార్యక్రమంలో భాగంగా గణపురం మండల బిజెపి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులచే జాతీయ జెండాను విశిష్టతను ప్రధాన రహదారిపై ప్రదర్శిస్తూ ప్రచార పర్వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు ఊర నవీన్ రావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం కింద ప్రచారాన్ని ఆరంభించిందని ఈ కార్యక్రమంలో ప్రతి భారతీయుడు జాతీయ జెండాను తమ ఇంటి మీద ఎగురవేయాల్సిన అవసరం ఉందని జాతీయ జెండా కేవలం ఒక చిహ్నం మాత్రమే కాదు దేశ సామూహిక గర్వానికి ఐక్యతకు ప్రతీక అని తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ లో పాల్గొన్న విద్యార్థులకు పండ్లు పంపిణి చేసి ఫ్రోబెల్ స్కూల్ నారాయణ స్కూల్ యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోహర్ ఘర్ తిరంగా ర్యాలీ కన్వీనర్ మండల రాజు, సీనియర్ నాయకులు సోమ దామోదర్, దుగిశెట్టి పున్నమ్ చందర్, మంద మహేష్, ఉప అధ్యక్షులు మాదాసు మొగిలి, డాకూరి కృష్ణ రెడ్డి, బూత్ అధ్యక్షులు కాశెట్టి సాయి, రేపాక సంతోష్, వేముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి రావడం నా అదృష్టం గా భావిస్తున్న..

## -నందమూరి రామకృష్ణ





**సత్తుపల్లి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త)** సత్తుపల్లి కి రావడం నా అదృష్టంగా భావిస్తున్నానని స్వర్గీయ ఎన్టీ రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకి వెళ్తూ మార్గమధ్యంలో సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఆయనకు పార్టీ నాయకులు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాచారం గ్రామానికి మోటార్ సైకిల్ ర్యాలీతో బయలుదేరి వెళ్లారు. కాకర్లపల్లి గ్రామం లో పార్టీ అభిమానులతో ముచ్చటించిన నందమూరి రామకృష్ణ.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు విచ్చేసిన నందమూరి రామకృష్ణ కాకర్లపల్లి గ్రామంలో కాకర్లపల్లి టిడిపి ఆఫీస్ నందు ఆగి అక్కడ ఉన్న పార్టీ అభిమానులు కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ఇక్కడినుండి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాకర్లపల్లి టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు బీమా దరఖాస్తుకు రేపు ఒక్కరోజే ఛాన్స్

**సత్తుపల్లి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ : రైతులకు ముఖ్యమైన అలర్ట్. రైతు బీమా దరఖాస్తుకు ఒక్కరోజే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులకు రైతు బీమా పథకం అమలు కోసం ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ



సూచించింది. 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్యలో జన్మించి, ఈ సంవత్సరం జూన్ 5వ తేదీ నాటికి పాస్ పుస్తకం పొందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుతోపాటు పట్టాదారు పాస్‌బుక్, రైతు ఆధార్ కార్డు నామినీ ఆధార్ కార్డులను ఏఈవోకు అందజేయాలి.

# ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినలకు పుస్తకాలు అందించిన... సత్తుపల్లి ఎంఎల్ఏ

## డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**సత్తుపల్లి/ఆగస్టు12(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి పట్టణం - కిష్టారం గ్రామం వద్ద- ప్రభుత్వ జూనియర్ నర్సింగ్ కాలేజీ విద్యార్థినలకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ మరియు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పుస్తకాలు అందించారు. అనంతరం ఇటీవల నర్సింగ్ కోర్స్ పరీక్ష



ఫలితాలులో 94శాంతం సాధించిన సందర్భంగా నర్సింగ్ విద్యార్థినలను మరియు నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ని, ఉపాధ్యాయులను అభినంధించిన.. మట్టా దంపతులు అనంతరం కళాశాల లో ఎంఎల్ఏ పుట్టినరోజు వేడుకలు నిర్వహించటం జరిగింది..ఈ కార్యక్రమం లో సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## కేరళ కుట్టిగా జాన్వీ పరమ్ సుందరి

సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ జంటగా తెరకెక్కిన సినిమా 'పరమ్ సుందరి' తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇందులో.. సౌత్ ఇండియన్ టాప్ హీరోలు రజనీకాంత్, మోహన్‌లాల్, అల్లు అర్జున్‌లాంటి వారిని ఇమిటేట్ చేసి జాన్వీ అలరించారు. కేరళ అమ్మాయిగా జాన్వీ, దిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ సందడి చేశారు.

# విదేశాల్లో స్పిరిట్ తొలి షెడ్యూల్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో 'స్పిరిట్' పేరుతో బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు- తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ భారీ యాక్షన్ ఎంటర్-టైనర్‌లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. సంగీత దర్శకుడు హర్ష వర్ధన్ రామేశ్వర్ ఈ చిత్ర పాటల్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు- తెలిసింది.




## సతీలీలావతి చిత్రం పెళ్లిపాట విడుదల

లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'కి తాతినేని సత్య దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా నుంచి పెళ్లిపాటను టీమ్ విడుదల చేసింది. 'ఓరి పిల్లా..చిత్తూరు పిల్లా..' అంటూ సాగే ఈ పాటకు వనమాలి లిరిక్స్ అందించగా.. నూతన్ మోహన్, కృష్ణ తేజస్వీ ఆలపించారు. మిక్కీ జే మేయర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటించనున్నారు.




## రావు బహద్దూర్‌గా సత్యదేవ్

'కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వెంకటేశ్ మహా చాలా రోజుల తర్వాత తన కొత్త సినిమాను ప్రారంభించాడు. వెంకటేశ్ మహా దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రావుబహదూర్. ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతున్నాడు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ -టైటిల్‌తో పాటు- ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఇందులో సత్యదేవ్ రావు బహదుర్ అనే జమీందార్ పాత్రలో కనిపించబోతున్నట్లు- తెలుస్తుంది. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్-టైనమెంట్స్ బ్యానర్‌లపై అనురాగ్ రెడ్డి, చింత గోపాలకృష్ణ రెడ్డి, శరత్ చంద్ర నిర్మించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ చూస్తుంటే.. సత్యదేవ్ వృద్ధుడి పాత్రలో ఉండగా.. అతడి చుట్టు- చిన్నపిల్లలు ఉండడం చూడవచ్చు. ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ప్రకటించింది.





## అనుపమ హాట్ కామెంట్స్.. టార్గెట్ ఎవరు..?



అందాల భామ అనుపమ పరమేశ్వరన్ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా కూడా ఎందుకో ఇంకా వెనకపడే ఉంది. బహుశా ఆమె వ్యక్తపరిచే అభిప్రాయాల వల్ల ఆమెకు అవకాశాలు రావట్లేదా అన్న డౌట్ వస్తుంది. ఎందుకంటే లేటెస్ట్ గా పరదా సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ లో అనుపమ సినిమాకు తాను 7 గంటలకు వస్తే రెండున్నర గంటల తర్వాత అంటే 9:30 గంటలకు షాట్ రెడీ అంటారు. అలా రెండున్నర గంటల టైం ఎందుకు వేస్ట్ అని తను అడిగితే మాత్రం ఈ అమ్మాయికి యాటిట్యూడ్ ఎక్కువ అనేస్తారు. హీరోయిన్ కాకుండా వేరే వాళ్లు చేస్తే.. నేను కూడా సినిమా గురించే ఆలోచిస్తాను కదా.. ఈ రెండున్నర గంటల టైం లో సినిమాకు సంబందించిన థింగ్స్ ఎన్నో చేయొచ్చు. కో యాక్టర్ కోసం అన్ని గంటల టైం ఎందుకు వెయిట్ చేయాలి. ఇదే హీరోయిన్ కాకుండా వేరే వాళ్లు చేస్తే ఇలానే రియాక్ట్ అవుతారా వాళ్ల వెనకాలే కదా మాట్లాడేది. మరి హీరోయిన్స్ తో ఎందుకు వెంటనే ఆన్సర్ ఇస్తారంటూ అంటుంది అనుపమ పరమేశ్వరన్. తాను చేసిన కొన్ని సినిమాల షూటింగ్స్ లో తన అనుభవాలను చెబుతూ ఇలా రెండున్నర గంటలు హీరోయిన్ సెట్ లో వెయిట్ చేయాలంటూ చెప్పుకొచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇలా అడగడంలో తప్పులేదు కానీ సినిమా అంతే సమిష్టి కృషి. ఒకరిద్దరు కాస్త టైం అడ్జెస్ట్ చేసుకోక తప్పదు. ప్రతిసారి అలా జరిగితే కష్టమే కానీ ఏదో ఒకరోజు అలా రెండు మూడు గంటలు అనుకోకుండా వెయిట్ చేయాల్సి రావడం సినిమా షూటింగ్స్ లో కామనే. అనుపమ చెప్పిన ఈ పాయింట్ బహుశా అందరి హీరోయిన్స్ సపోర్ట్ చేసే ఛాన్స్ ఉంటుంది. కానీ ఎవరు కావాలని హీరోయిన్ ని ఇబ్బంది పెట్టాలని ఉండదు. ఐతే ఎవరైతే అలా చేస్తున్నారో వాళ్ల గురించి కచ్చితంగా హీరోయిన్స్ ఇలా ఇన్ డైరెక్ట్ గా కాకుండా డైరెక్ట్ ఎటాక్ కి సిద్ధమయ్యే రోజు కూడా వస్తుంది. ప్రవీణ్ కండ్రేగుల డైరెక్షన్ లో.. ఇక అనుపమ పరమేశ్వరన్ సినిమాల విషయానికి వస్తే ప్రెజంట్ పరదాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అనుపమ. ఈ సినిమా మీద అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది. ప్రవీణ్ కండ్రేగుల డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో సంగీత, దర్శన రాజేంద్రన్ కూడా ఇంపార్టెంట్ రోల్స్ లో నటించారు. అనుపమ లీడ్ రోల్ లో నటించిన సినిమా అవ్వడం వల్ల ఈ సినిమా బాధ్యత అంతా తన మీద వేసుకుంది అమ్మడు. సినిమాకు ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టగా ఆగష్టు 22న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

## సింగపూర్‌లో రజనీ మేనియా

### కూలీ సినిమా కోసం సెలవు ప్రకటించిన ఓ సంస్థ




తలైవర్ సూపర్ స్టార్ రజనీకాంత్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అతడి సినిమా వస్తుందంటే చాలు వరల్డ్ వైడ్‌గా ఉన్న అతడి అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తుంటారు. అయితే ఆయన నటించిన తాజా చిత్రం 'కూలీ' విడుదల సందర్భంగా సింగపూర్‌లోని ఓ కంపెనీ తమ ఉద్యోగులకు పెయిడ్ హాలిడే ప్రకటించడం ప్రస్తుతం వైరల్‌గా మారింది. కూలీ సినిమా ఆగష్టు 14న విడుదలవుతున్న సందర్భంగా.. సింగపూర్‌లోని ఫార్మర్స్ కన్‌స్ట్రక్షన్స్ పీటీఈ లిమిటెడ్ అనే సంస్థ తమ తమిళ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా సెలవు మంజూరు చేసింది. అంతేగాకుండా.. సినిమా మొదటి రోజు ఫస్ట్ షో టికెట్లతో పాటు-, ఆహారం, పానీయాల ఖర్చుల కోసం 30 సింగపూర్ డాలర్లను కూడా అందిస్తామని ప్రకటించింది. ఉద్యోగుల సంక్షేమం, ఒత్తిడి నిర్వహణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- ఆ సంస్థ వెల్లడించింది. ఈ ప్రకటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, భారతదేశంలోని రజినీ అభిమానులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర వంటి దిగ్గజ నటు-లు కీలక పాత్రలు పోషిస్తుండటంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది.

------------